సాక్షి ఆదిలాబాద్

శుక్రవారం । 4 । ఏప్రిల్ । 2025



విద్యార్థులకు ఫౌండేషన్..

సంక్షేమ గురుకుల పాఠశాలల విద్యార్థులకు మహర్దశ రానుంది. ఎనిమిదో తరగతి నుంచే ఫౌండేషన్ కోర్సుల్లో శిక్షణ ఇచ్చేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. 8లో▸



వైభవంగా ఆదివాసీల పూజలు

ఇంద్రవెల్లిలోని ఇంద్రాదేవి ఆలయంలో ఆదివాసీలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మొక్కులు చెల్లించుకున్నారు. 9లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
36.0/24.0

ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి. వాతావరణం పొడిగా ఉంటుంది. ఆకాశం వైవిధ్యంగా మేఘావృతమవుతుంది. వేకువజామున అక్కడక్కడా వర్షం కురిసే అవకాశముంది.

న్యూస్‌రీల్

ఘనంగా దొడ్డి కొమురయ్య జయంతి



నివాళులర్పిస్తున్న కలెక్టర్, అధికారులు

కైలాస్‌నగర్: భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి విముక్తి కోసం నడుం బిగించి దొడ్డి కొమురయ్య సాగించిన తెలంగాణ సాయుధ పోరాటం మరిచిపోలేనిదని కలెక్టర్ రాజర్షి షా కొనియాడారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో కొమురయ్య జయంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి స్ఫూర్తిని రగిలించిన దొడ్డి కొమురయ్య అమరత్వం తెలంగాణ ఉద్యమానికి స్ఫూర్తిగా నిలిచిందని వివరించారు. సబ్ కలెక్టర్ యువరాజ్, ఆర్డీవో వినోద్‌కుమార్, జిల్లా బీసీ సంక్షేమాధికారి రాజలింగు, గొల్ల, కురుమ సంఘం నాయకులు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

డీఈవోగా బాధ్యతల స్వీకరణ



డీఈవోకు పుష్పగుచ్ఛం ఇస్తున్న ఉద్యోగులు

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా విద్యాశాఖ ఎఫ్ఏసీ అధికారిగా శ్రీనివాస్‌రెడ్డి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇదివరకు డీఈవోగా పనిచేసిన ప్రణీత ఉద్యోగ విరమణ పొందిన విషయం తెలిసిందే. ఈమె స్థానంలో హైదరాబాద్‌లోని డైరెక్టరేట్ కార్యాలయంలో మోడల్ స్కూల్ డిప్యూటీ డైరెక్టర్‌గా పనిచేస్తున్న దుర్గాప్రసాద్‌కు అదనపు బాధ్యతలు అప్పగించినప్పటికీ ఆయన విధుల్లో చేరలేదు. దీంతో వయోజన విద్యాశాఖలో డిప్యూటీ డైరెక్టర్‌గా పనిచేస్తున్న శ్రీనివాస్‌రెడ్డికి కలెక్టర్ పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు. బాధ్యతలు స్వీకరించిన శ్రీనివాస్‌రెడ్డిని విద్యాశాఖ ఏడీ వేణుగోపాల్‌గౌడ్, సూపరింటెండెంట్ మధుసూదన్‌రెడ్డి, ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ అశోక్, సెక్టోరియల్ అధికారి సుజాత్‌ఖాన్, ఉద్యోగులు తుషార్, రాజేశ్వర్, గోవర్ధన్, సతీశ్ తదితరులు మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

మూడు బార్లకు నోటిఫికేషన్

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలో రెన్యువల్ కాని మూడు బార్లకు నోటిఫికేషన్ జారీ చేసినట్లు డీపీఈవో హిమశ్రీ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 26లోపు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. డీపీఈవో పేరిట రూ.లక్ష డీడీ, లేదా చలాన్ తీసి ఎక్సైజ్ కార్యాలయంలో అందించాలని తెలిపారు. ఈనెల 29వ తేదీన కలెక్టర్ చేతుల మీదుగా లాటరీ పద్ధతిలో ఎంపిక చేయనున్నట్లు పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 8712658771, 8712688780 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ప్రభాకరరావు

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా కేంద్రంలోని కోర్టు ఆవరణలో గురువారం జిల్లా జడ్జి ప్రభాకరరావు చలివేంద్రాన్ని ప్రారంభించారు. డీఎస్ఎల్ఏ, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టమ్ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఎస్ఎల్ఏ కార్యదర్శి సౌజన్య, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నగేశ్, న్యాయవాదులు పాల్గొన్నారు.

భూముల విక్రయం ఆపాలి

కైలాస్‌నగర్: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూముల విక్రయాన్ని ప్రభుత్వం వెంటనే ఆపాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి మడావి గణేశ్ డిమాండ్ చేశారు. పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో గురువారం కలెక్టరేట్ ఎదుట ప్లకార్డులతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా గణేశ్ మాట్లాడుతూ.. హెచ్‌సీయూ భూములను కాపాడాలని నాలుగు రోజులుగా నిరసన తెలుపుతున్న విద్యార్థి నాయకులపై పోలీసులతో లాఠీచార్జి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. భూముల విక్రయాన్ని ఆపకుంటే రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌కు తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గణేశ్, నాయకులు సాయి, అశోక్, మారుతి, ప్రీతం తదితరులున్నారు.



జిల్లా కేంద్రంలోని విమానాశ్రయ మైదానం

భూములు.. అయోమయం

- ఎయిర్‌పోర్టు ఏర్పాటుపై గందరగోళం
- అందుబాటులో రక్షణశాఖ భూములు
- ఎయిర్‌ఫోర్స్ ఏర్పాటు సమయంలోనే అదనంగా భూముల అవసరం పడేనా?
- విధివిధానాలు వస్తేనే రానున్న స్పష్టత

సాక్షి, ఆదిలాబాద్: ఆదిలాబాద్‌లో ఎయిర్‌పోర్టు ఏర్పాటు చేసేందుకు కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. భవిష్యత్‌లో ఎయిర్‌ఫోర్స్ కూడా ఇక్కడే ఏర్పాటు చేస్తామని ప్రకటించడం ఈ ప్రాంతవాసులను సంబరాల్లోకి నెట్టింది. గతంలో భూసేకరణకు చేపట్టిన సర్వే ప్రకారం ఆ భూముల సేకరణపై యజమానుల్లో ఆందోళన మొదలైంది. ఈ నేపథ్యంలో వారు అధికారులు, నేతలను కలుస్తున్నారు. భూ సేకరణ విషయమై ఫోన్‌లో వాకబు చేస్తున్నారు. ఆదిలాబాద్ చుట్టుపక్కల భూముల విషయంలో ప్రభుత్వం తీసుకునే నిర్ణయంపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

ఎయిర్‌పోర్టుకు సరిపోతుందా..

ఆదిలాబాద్‌లో రక్షణశాఖకు సంబంధించి వాయుసేన భూమి 369 ఎకరాలు ఉంది. ఇది నిజాం కాలంలో విమానాల రాకపోకలకు సంబంధించి ఇంధన స్టేషన్‌గా ఉండేదని తెలుస్తోంది. ఆ తర్వాత కాలంలో రక్షణశాఖ పరిధిలోకి ఈ భూములు వచ్చేశాయి. అయితే ఆదిలాబాద్‌లో ఇన్ని ఎకరాల భూములుండటం, హైదరాబాద్, మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌కు మధ్యలో ఇక్కడ విమానాశ్రయం ఏర్పాటు చేస్తే అన్ని విధాలా అనువుగా ఉంటుందనే డిమాండ్ దశాబ్దాలుగా ఉంది. ఇందుకు అనుగుణంగా గతం నుంచే పలుసార్లు వాయుసేనకు సంబంధించిన వారు ఈ భూముల రక్షణ విషయంలో పరిశీలనకు రావడంతో పాటు భవిష్యత్‌లో ఇక్కడ వైమానిక శిక్షణ దళం ఏర్పాటు చేస్తామని సంకేతాలిస్తూ వచ్చారు. అయితే భౌగోళిక పరిస్థితుల దృష్ట్యా ఇక్కడ ఎయిర్‌పోర్టు ఏర్పాటుకు అనువుగా ఉంటుందనే డిమాండ్ నేపథ్యంలో ఎయిర్‌పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ) వారు కూడా పలుసార్లు ఇక్కడికి పరిశీలనకు వచ్చారు. ఎయిర్‌పోర్టు ఏర్పాటు చేస్తారనే ప్రచారం ముందు నుంచే ఉంది. అయితే ఎయిర్‌పోర్టు నిర్మాణం జరుగుతుందా.. లేదా ఎయిర్‌ఫోర్స్ వస్తుందా.. అనే సందిగ్ధం అప్పట్లో వెంటాడేది. తాజాగా ఈ రెండూ ఏర్పాటు చేస్తామని కేంద్రం చెప్పడంతో ప్రస్తుతం భూముల విషయంలో అందరి మదిలో ఆలోచనలు మొదలయ్యాయి.

గతంలో సఖ్యత లేకే..

గతంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సరైన సఖ్యత లేక ఈ ప్రణాళిక ముందుకు సాగలేదు. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం ఆదిలాబాద్ విమానాశ్రయాన్ని పౌర కార్యకలాపాల కోసం అభివృద్ధి చేయాలని కేంద్రాన్ని కోరడం, కేంద్రం కూడా ఈ విషయంలో సానుకూలంగా ముందుకు రావడంతో ముందడుగు పడింది. ఈ నేపథ్యంలో ప్రస్తుతం రక్షణ శాఖ అధీనంలోని వందల ఎకరాల భూములే ఎయిర్‌పోర్టు ఏర్పాటుకు సరిపోతాయా.. లేదా అదనంగా భూమిని సేకరించాల్సి వస్తుందా.. అనే విషయంలో సందిగ్ధం నెలకొంది.

డీపీఆర్ కోరిన నేపథ్యంలో..

ప్రస్తుతం రక్షణ మంత్రిత్వ శాఖ నుంచి ఆదిలాబాద్‌లో ఎయిర్‌పోర్టు ఏర్పాటుకు అనుమతిస్తూ ఎయిర్‌పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా డిటేల్ ప్రాజెక్ట్ రిపోర్టు (డీపీఆర్) ఇవ్వాలని కోరింది. దీంట్లో రన్‌వే, సివిల్ టర్మినల్, ఎయిర్‌క్రాఫ్ట్ పార్కింగ్ ఆప్రాన్, ఇతర మౌలిక సదుపాయాల కల్పనకు సంబంధించి దీనిని అడిగింది. ఇటు రాష్ట్ర ప్రభుత్వం ఆసక్తి చూపడం, రానున్న రోజుల్లో ఎయిర్‌ఫోర్స్ ఏర్పాటు చేసినా దానికి ఉపయోగపడేలా ఎయిర్‌పోర్టు ఉండాలని కేంద్రం ఆలోచనతో రక్షణ శాఖ భూములనే సంయుక్తంగా వినియోగించుకునేందుకు ఈ డిటేల్ ప్రాజెక్ట్ రిపోర్టు అడిగిందని పలువురు నిపుణులు చెబుతున్నారు. అయితే దీని విషయంలో పూర్తి విధివిధానాలు ప్రభుత్వం నుంచి వస్తేనే ఏదైన చెప్పగలుగుతామని అధికారులు పేర్కొంటున్నారు.

ఎయిర్‌ఫోర్స్ ఏర్పాటు చేసేటప్పుడే..

ప్రస్తుతం రక్షణ శాఖ అధీనంలోని వందల ఎకరాల భూములను ఎయిర్‌పోర్టు ఏర్పాటుకు వినియోగించుకుంటే ఇప్పటికిప్పుడే అదనంగా భూసేకరణకు ఆవశ్యకత ఉండదని అధికారులు చెబుతున్నారు. భవిష్యత్‌లో ఎయిర్‌ఫోర్స్ ఏర్పాటు చేసే సమయంలో అదనంగా భూమి సేకరించాల్సి వస్తుందని పేర్కొంటున్నారు. ఈ నేపథ్యంలోనే గతంలో సర్వే చేసిన 1,592 ఎకరాల ఆవశ్యకత ఇప్పటికిప్పుడే ఉండదని చెబుతున్నారు. భవిష్యత్‌లో ఎయిర్‌ఫోర్స్ ఏర్పాటు చేసేటప్పుడే ఆ భూముల సేకరణ తప్పనిసరి అని అభిప్రాయపడుతున్నారు.

ఎయిర్‌ఫోర్స్ నిర్మించినప్పుడే..



ఆదిలాబాద్‌లో ఎయిర్‌పోర్టు ఏర్పాటు చేస్తారనే నిర్ణయం నేపథ్యంలో భూములు కోల్పోతామా? అని పలువురు ప్రశ్నిస్తున్నారు. ప్రస్తుతం రక్షణశాఖ అధీనంలోని భూములు ఎయిర్‌పోర్టు ఏర్పాటుకు సరిపోతాయి. ఎయిర్‌ఫోర్స్ నిర్మించేటప్పుడే భూసేకరణ చేయాల్సి వస్తుంది. ఈ నేపథ్యంలోనే జాయింట్ యూజర్ ఎయిర్‌ఫీల్డ్‌గా మలచడం ద్వారా ఐఏఎఫ్, ఏఏఐ నిర్మాణాత్మకంగా ముందుకెళ్తాయి.

– బాలూరి గోవర్ధన్‌రెడ్డి, కాంగ్రెస్ నేత

బీఆర్ఎస్ హయాంలోనే..



2016–17లో బీఆర్ఎస్ ప్రభుత్వం ఓ ప్రైవేట్ కన్సల్టెన్సీ ద్వారా భూములను సర్వే చేయించింది. 1,500 ఎకరాలకు పైగా భూమి అందుబాటులో ఉందని అప్పట్లో గుర్తించింది. 2022–23లో ఈ భూముల్లో ఎయిర్‌పోర్టు ఏర్పాటు చేయడానికి టెక్నికల్ పరిశీలన చేపట్టగా అనువుగా ఉన్నట్లు తేలింది. ఆనాడు బీఆర్ఎస్ ప్రభుత్వం కృషి ఫలితంగానే ఆదిలాబాద్‌కు ఎయిర్‌పోర్టు మంజూరైంది.

– జోగు రామన్న, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు

విధివిధానాలు వస్తేనే స్పష్టత



ఆదిలాబాద్‌లో ఎయిర్‌పోర్టు, ఎయిర్‌ఫోర్స్ ఏర్పాటు చేసే విషయంలో నిర్ణయం వెలువడినప్పటికీ దీంట్లో ఎలా ముందుకెళ్లాలనే విషయంలో ఇప్పటివరకు ఎలాంటి విధివిధానాలు రాలేదు. ఇందుకు భూసేకరణ చేయాల్సి వస్తుందా.. లేదా.. అనేది ప్రభుత్వ నిర్ణయానికి అనుగుణంగా ఉంటుంది. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగానే మేము నిర్ణయం తీసుకుంటాం.

– వినోద్‌కుమార్, ఆర్డీవో, ఆదిలాబాద్

ప్రధాని మోదీ కృషి ఫలితమే..



ప్రధాని మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న నాయకులు

ఆదిలాబాద్: ఎంపీ గోడం నగేశ్, ఎమ్మెల్యే పాయల్ శంకర్ కృషితోనే ఎయిర్‌పోర్ట్ ఏర్పాటుకు మార్గం సుగమమైందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పతంగే బ్రహ్మానంద్ పేర్కొన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని వినాయక్ చౌక్‌లో ప్రధాని మోదీ, ఎంపీ నగేశ్, ఎమ్మెల్యే శంకర్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎయిర్‌పోర్టు కోసం ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ కృషి చేశారని, ఎంపీ గోడం నగేశ్ పార్లమెంట్‌లోనూ ప్రస్తావించారని పేర్కొన్నారు. ప్రధాని మోదీ, ఎంపీ నగేశ్, ఎమ్మెల్యే శంకర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ పట్టణాధ్యక్షుడు వేదవ్యాస్, నాయకులు మహేందర్, ప్రవీణ్, విజయ బోయర్, రాకేశ్, అర్జున్, దినేశ్, సుభాష్, సిద్ధార్థ తదితరులు పాల్గొన్నారు.

సీఎం రేవంత్ చొరవతోనే..



సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న నాయకులు

కైలాస్‌నగర్: ఆదిలాబాద్‌లో ఎయిర్‌పోర్టు ఏర్పాటుకు భారత వాయుసేన అనుమతులివ్వడం సీఎం రేవంత్‌రెడ్డి చొరవతోనే సాధ్యమైందని డీసీసీబీ డైరెక్టర్ బాలూరి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలో గురువారం కాంగ్రెస్ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క, కంది శ్రీనివాస్‌రెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ.. ఆదిలాబాద్‌కు ఎయిర్‌పోర్టు మంజూరు చేయాలని పార్లమెంట్ ఎన్నికల సమయంలో జిల్లాకు వచ్చిన ప్రధాని మోదీకి సీఎం రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి చేశారని గుర్తు చేశారు. ఆదిలాబాద్‌లో ఎయిర్‌పోర్టు ఏర్పాటుతో జిల్లా అన్ని రంగాల్లో అభివృద్ధి చెందే అవకాశం ఉందని అభిప్రాయపడ్డారు.

‘అసాంఘిక చర్యలు అరికడతాం’



మాట్లాడుతున్న ఎస్పీ అఖిల్ మహాజన్

ఆదిలాబాద్‌టౌన్: అసాంఘిక చర్యలను అరికడతామని ఎస్పీ అఖిల్ మహాజన్ పేర్కొన్నారు. గురువారం పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లోని సమావేశ మందిరంలో ఆదిలాబాద్ సబ్ డివిజనల్ పోలీస్ అధికారులతో నెలవారీ నేర సమీక్ష నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా నమోదైన కేసుల వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. గంజాయి స్మగ్లర్లపై నిఘా ఏర్పాటు చేసి నిరంతరం పర్యవేక్షించాలని తెలిపారు. త్వరలో ప్రారంభించనున్న ‘పోలీస్ మీకోసం’ కార్యక్రమాన్ని ప్రతీవారం ఒక్కో గ్రామంలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పెండింగ్ గ్రేవ్ కేసులు, నాన్ గ్రేవ్ కేసులు, పోక్సో, ఇన్వెస్టిగేషన్ కేసులపై విచారణ జరిపి అధికారుల ద్వారా వివరాలు తెలుసుకున్నారు. కోర్టు డ్యూటీ అధికారి విధులను పర్యవేక్షిస్తూ పెండింగ్ కేసుల వివరాలు ఎప్పటికప్పుడు నవీకరించాలని తెలిపారు. సాక్షులను కోర్టులో హాజరుపర్చి నిందితులకు శిక్ష పడేలా చూడాలని పేర్కొన్నారు. రాత్రివేళ అనుమానాస్పదంగా తిరిగే వ్యక్తుల వేలిముద్రలు సేకరించి ఆన్‌లైన్‌లో పొందుపర్చాలని సూచించారు. సమీక్షా సమావేశంలో డీఎస్పీలు జీవన్‌రెడ్డి, నాగేందర్, సీఐలు సునీల్‌కుమార్, కరుణాకర్, శ్రీనివాస్, ప్రణయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వ్యాయామ విద్యకు ఉజ్వల భవిష్యత్



స్టాలిన్ బాబును సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

ఆదిలాబాద్‌టౌన్: వ్యాయామ విద్యకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని ఎస్‌సీఈఆర్టీ రిసోర్స్ పర్సన్ స్టాలిన్‌బాబు పేర్కొన్నారు. ప్రమోషన్ పొందిన ఉపాధ్యాయులకు ప్రభుత్వ డైట్ కళాశాలలో చేపట్టిన రెండు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వ్యాయామ విద్యను తప్పనిసరిగా సబ్జెక్ట్‌గా మార్చేందుకు సన్నాహాలు జరుగుతున్నట్లు పేర్కొన్నారు. సమగ్ర శిక్షా అభియాన్ కింద ప్రభుత్వం నిధులు కూడా విడుదల చేస్తుందని తెలిపారు. హెల్త్, ఫిజికల్ ఎడ్యుకేషన్‌కు గుర్తింపు రానుందని పేర్కొన్నారు. డైట్ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపల్ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ.. విద్యార్థులకు నాణ్యమైన విద్యను బోధించి ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దాలని సూచించారు. కార్యక్రమంలో గిరిజన క్రీడల అభివృద్ధి అధికారి పార్థసారథి, లెక్చరర్లు జయరావు, ఉమాకాంత్, రిసోర్స్ పర్సన్ భూమన్న, హరిచరణ్, పీఈటీల సంఘం జిల్లా కార్యదర్శి సాయికుమార్, మమత తదితరులు పాల్గొన్నారు.

సోదాల కలకలం

- రవాణాశాఖ చెక్‌పోస్టుల్లో ఏసీబీ తనిఖీలు
- రాత్రిపూట రంగంలోకి దిగిన వైనం
- వాంకిడి వద్ద రూ.45,100 నగదు లభ్యం



వాంకిడి చెక్‌పోస్టు

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: రవాణాశాఖ చెక్‌పోస్టుల్లో ఏసీబీ అధికారుల తనిఖీలు కలకలం రేపుతున్నాయి. బుధవారం రాత్రి జరిపిన సోదాల్లో వాంకిడి చెక్‌పోస్టులో రూ.45,100 పట్టుబడ్డాయి. రాత్రి 11.45 గంటల నుంచి తెల్లవారు జామున 3గంటల వరకు తనిఖీలు కొనసాగాయి. ఆదిలాబాద్, కరీంనగర్ డీఎస్పీలు విజయ్‌కుమార్, రమణమూర్తి, మరో నలుగురు సీఐలు ఏకకాలంలో అక్కడి రికార్డులు పరిశీలించారు. రెండు ఫోన్లు సీజ్ చేశారు. ఆ సమయంలో డ్యూటీలో ఏఎంవీ మాత్రమే ఉండగా, ఇంకా ప్రైవేట్ వ్యక్తులూ ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఇదే తరహాలో గతేడాది మేలో భోరజ్ చెక్‌పోస్టు వద్ద రూ.11,630, గత డిసెంబర్ 4న రూ.62,500 నగదు ఏసీబీ అధికారులకు పట్టుబడ్డాయి. చెక్‌పోస్టుల్లో నిత్యం వాహనదారులు, డ్రైవర్లు, సహాయకుల నుంచి బండికో రేటుగా అనధికారికంగా ప్రైవేట్ సిబ్బంది వసూళ్లు చేస్తున్నది బహిరంగ రహస్యమే. ఏసీబీ సోదాలతో గురువారం వాంకిడిలో ఎలాంటి వాహన తనిఖీలు లేకుండానే రాకపోకలు సాగించాయి.

మూడు చోట్ల ఇదే తంతు

ఉమ్మడి జిల్లా మహారాష్ట్రకు సరిహద్దుతో, ఉత్తర, దక్షిణ భారతదేశానికి కీలక రోడ్డు మార్గంగా ఉంది. ఆదిలాబాద్‌లోని ఎన్‌హెచ్–44పై భోరజ్, ఆసిఫాబాద్ జిల్లా ఎన్‌హెచ్–363పై వాంకిడి, నిర్మల్ పరిధి ఎన్‌హెచ్–61 వద్ద తానూరు మండలం బెల్‌తరోడా వద్ద అంతర్రాష్ట్ర చెక్‌పోస్టులున్నాయి. ఇక్కడే సమీకృత చెక్‌పోస్టులూ ఉన్నాయి. రవాణాశాఖ చెక్‌పోస్టులో నిత్యం వందల వాహనాలను చట్టప్రకారం అన్ని ధ్రువపత్రాలు ఉన్నాయా? లేవా? అని తనిఖీలు చేస్తూ అధికారులు అనుమతి ఇవ్వాలి. అయితే పరిశీలన పేరిట వాహనదారుల నుంచి అనధికారికంగా డబ్బులు వసూలు చేస్తున్నరనేది ప్రధాన ఆరోపణ.

డ్యూటీ కోసం పోటీ

రవాణా శాఖలో చాలామంది అధికారులు, సిబ్బంది చెక్‌పోస్టుల్లో డ్యూటీ చేసేందుకే మొగ్గు చూపుతున్నారు. అసిస్టెంట్ మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ల నుంచి సీనియర్ మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్లు, కానిస్టేబుళ్లు, సిబ్బంది వరకు రాజకీయ, ఉన్నతాధికారుల పైరవీలతో అక్కడ డ్యూటీలు తెచ్చుకుని పని చేస్తున్నారు. చెక్‌పోస్టు డ్యూటీకి వెళ్తే ‘లాభదాయకం’గా మారడంతో పోటీ పడుతున్నారు. అక్కడ పని చేస్తున్న అధికారుల సంఖ్యను బట్టి రోజువారీగా డ్యూటీల్లో ఉంటున్నారు.

నగదు ముట్టుకోకుండా..

ఏసీబీ అధికారులు ప్రభుత్వ ఉద్యోగులపైనే కేసులు నమోదు చేస్తూ విచారణ చేస్తుంటారు. ఒకవేళ ప్రైవేట్ వ్యక్తులు ఉంటే వారు ఏ అధికారి ప్రోద్బలంతో ఉన్నారు? వారివెనుక ఎవరున్నారనే స్పష్టమైన ఆధారాలు తీసుకుంటారు. లేకపోతే అధికారులపై కేసులు నమోదు చేసే అవకాశం లేదు. సాధారణంగా లంచం తీసుకునేటప్పుడు నేరుగా దొరికిన ఆ అధికారి చేతులు, నగదుతో రసాయన పరీక్ష చేసి, సాంకేతిక ఆధారాలతో కోర్టులో అందజేస్తారు. కానీ చెక్‌పోస్టుల్లో ఏ అధికారీ చేతితో డబ్బులు ముట్టుకోరు. దీంతో లెక్కచూపని డబ్బులు ఎక్కడి నుంచి వచ్చాయనేవి మిస్టరీగా మారుతోంది. అవినీతి కేసులో పక్కా ఆధారాలుంటే కేసు ముందుకు వెళ్తుంది. గతంలో పట్టుబడిన నగదుపైనా ఇంకా దర్యాప్తు కొనసాగుతోంది. తాజాగా దొరికిన నగదుపైనా ఏసీబీ అధికారులు లోతుగా దర్యాప్తు చేయనున్నారు.

ఉపాధి కల్పనకే ‘యువ వికాసం’

- జిల్లా బీసీ అభివృద్ధిశాఖ అధికారి రాజలింగు



రాజలింగు, జిల్లా బీసీ అభివృద్ధి శాఖ అధికారి

ఆదిలాబాద్‌రూరల్: నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకే రాష్ట్ర ప్రభుత్వం రాజీవ్ యువ వికాసం పథకాన్ని ప్రవేశ పెట్టిందని జిల్లా బీసీ అభివృద్ధిశాఖ అధికారి రాజలింగు తెలిపారు. అర్హుల నుంచి గత నెల 17వ తేదీ నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 5వరకే దరఖాస్తు గడువు ఉండగా వరుస సెలవుల నేపథ్యంలో 14వ తేదీ వరకు పొడిగించినట్లు తెలిపారు. ఇప్పటివరకు జిల్లా వ్యాప్తంగా 8,960 మంది దరఖాస్తు చేసుకున్నట్లు పేర్కొన్నారు. ఆయన ‘సాక్షి’కి ఇచ్చిన ఇంటర్వ్యూలో మరిన్ని వివరాలు వెల్లడించారు.

ఈ పథకం కింద ఎలాంటి యూనిట్లకు దరఖాస్తు చేసుకోవచ్చు?

పథకంలో మూడు కేటగిరీలుండగా, 118 రకాల యూనిట్లున్నాయి. చేతివృత్తులు చేసుకునే వారు, వ్యవసాయానికి సంబంధించిన పనిముట్లు, కుటీర పరిశ్రమల ఏర్పాటు, పరిశ్రమలు తదితర యూనిట్లకు దరఖాస్తు చేసుకోచ్చు.

ఎంత వరకు రుణమిస్తారు. ఇందులో ఎంత సబ్సిడీ ఉంటుంది?

రూ.50వేల వరకు వందశాతం సబ్సిడీ ఉంటుంది. దీనికి బ్యాంక్ లింకేజీ అవసరం లేదు. రూ.లక్ష యూనిట్‌కు రూ.90వేల సబ్సిడీ, 10 శాతం బ్యాంక్ లింకేజీ అవసరం. రూ.లక్ష నుంచి రూ.2లక్షల లోపు 20 శాతం బ్యాంక్ లింకేజీ, రూ.2లక్షల నుంచి రూ.4లక్షల వరకు 30 శాతం బ్యాంక్ లింకేజీ అవసరం ఉంటుంది.

ఏ యూనిట్‌కు ఎవరు అర్హులు?

బీసీ కార్పొరేషన్ ద్వారా బీసీ, ఈబీసీ, ఎంబీసీ వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నాం. వ్యవసాయేతర పథకానికి దరఖాస్తు చేసుకునేవారికి 21–55 ఏళ్లలోపు, అగ్రికల్చర్ యూనిట్‌కు దరఖాస్తు చేసుకునే వారికి 21–60 ఏళ్లలోపు ఉండాలి.

కుటుంబంలో ఎంత మందైనా దరఖాస్తు చేసుకోవచ్చా?

ఒక కుటుంబంలో ఒకరికే ఈ పథకం వర్తిస్తుంది. అలాగే బీసీ కార్పొరేషన్‌లో రుణం తీసుకుని ఐదేళ్లు పూర్తికాకుంటే రుణం వర్తించదు. ఆన్‌లైన్‌లో అప్లికేషన్ కూడా జనరేట్ కాదు.

వార్షికాదాయం ఎంత ఉండాలి? రేషన్ కార్డు లేని వారు ఎలా దరఖాస్తు చేసుకోవాలి?

గ్రామీణ ప్రాంతాల వారికి రూ.1.50 లక్షలలోపు, పట్టణ ప్రాంతాల వారికి రూ.2లక్షలలోపు వార్షికాదాయం ఉండాలి. రెవెన్యూ అధికారులు జారీ చేసిన ఆదాయ ధ్రువీకరణ పత్రాన్ని జత చేయాలి. సకాలంలో ఆదాయ ధ్రువీకరణ పత్రం పొందలేకపోతే రేషన్‌కార్డు జత చేసి దరఖాస్తు చేసుకోవచ్చు.

ఏదైనా సందేహముంటే ఎలా నివృత్తి చేసుకోవాలి?

ఇంకా సందేహాలుంటే సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ (సీజీజీ)ను ఆన్‌లైన్‌లో సంప్రదించి నివృత్తి చేసుకోవచ్చు. లేదా మా కార్యాలయానికి వచ్చినా నివృత్తి చేస్తాం

దరఖాస్తులు ఎక్కడ అందించాలి?

ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న గ్రామీణ ప్రాంతాలవారు ఎంపీడీవో కార్యాలయంలోని ప్రజాపాలన కేంద్రంలో, పట్టణ ప్రాంతాలవారు మున్సిపాలిటీ కార్యాలయంలో హార్డ్ కాపీలు అందజేయాలి. ఇప్పటివరకు దరఖాస్తు చేసుకోని వారు ఆఫ్‌లైన్‌లో కూడా దరఖాస్తు చేసుకోచ్చు. గ్రామీణ ప్రాంతాల వారు గ్రామపంచాయతీ కార్యదర్శి, మున్సిపాలిటీ పరిధిలోనివారు హెల్ప్‌డెస్క్‌లలో వార్డు అధికారులకు దరఖాస్తులు అందజేసి రశీదు తీసుకోవాలి.

పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి



అధికారులతో సమీక్షిస్తున్న శ్యామలాదేవి

కైలాస్‌నగర్: జిల్లాలో ఓపెన్ స్కూల్ పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని అడిషనల్ కలెక్టర్ కే శ్యామలాదేవి సూచించారు. పరీక్షల నిర్వహణపై గురువారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో వివిధ శాఖల అధికారులతో సమావేశమై మాట్లాడారు. ఏప్రిల్ 20 నుంచి 26వ తేదీ వరకు ఉదయం 9నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు, మధ్యాహ్నం 2.30నుంచి సాయంత్రం 5.30 వరకు పరీక్షలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పదో తరగతి పరీక్షలకు 623 మంది, ఇంటర్మీడియట్ పరీక్షలకు 465 మంది అభ్యాసకులు హాజరు కానున్నట్లు తెలిపారు. పదో తరగతికి మూడు, ఇంటర్మీడియట్ విద్యార్థులకు రెండు పరీక్షాకేంద్రాలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. అభ్యాసకులు గంట ముందుగానే కేంద్రాలకు చేరుకోవాలని తెలిపారు. పరీక్షాకేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని పేర్కొన్నారు. ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షలు ఈ నెల 26నుంచి మే 3వరకు ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో నిర్వహించనున్నట్లు వివరించారు. ఓపెన్ స్కూల్ జిల్లా కో ఆర్డినేటర్ ఎస్.అశోక్, డిప్యూటీ డీఎంహెచ్‌వో సాధన తదితరులు పాల్గొన్నారు.

అటవీ అనుమతులపై సమీక్ష

కైలాస్‌నగర్: జిల్లాలో చేపట్టనున్న రోడ్లు, భవనాలకు సంబంధించిన అటవీశాఖ అనుమతులపై కలెక్టర్ రాజర్షి షా గురువారం అటవీ, పంచాయతీరాజ్, ఆర్అండ్‌బీ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మండలాల వారీగా పెండింగ్‌లో ఉన్న నిర్మాణ అనుమతుల వివరాలు తెలుసుకున్నారు. ఎఫ్ఆర్ఏ చట్టం–2006 ప్రకారం అనుమతులు జారీ చేసేందుకు సాధ్యమయ్యే సెక్షన్ 3–2 కింద ప్రతిపాదనలు వారంలోపు డీఎఫ్‌వోకు అందజేయాలని ఆదేశించారు. ఇప్పటికే అనుమతులు జారీ అయిన పనులను వెంటనే ప్రారంభించాలని సూచించారు. అనంతరం అంగన్‌వాడీ భవన నిర్మాణాలపై కలెక్టర్ సమీక్షించారు. జిల్లాలో 200 అంగన్‌వాడీ కేంద్రాల్లో టాయిలెట్స్ నిర్మాణ పనుల గురించి మండలాల వారీగా ఆరా తీశారు. ట్రైబల్ వెల్ఫేర్‌లో 87 మంజూరు కాగా, 71 పూర్తి చేశామని తెలిపారు. సమావేశంలో డీఎఫ్‌వో ప్రశాంత్ బాజీరావు పాటిల్, జిల్లా సంక్షేమాధికారి మిల్కా, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

చోరీకి పాల్పడిన నిందితుడి రిమాండ్

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని జైజవాన్‌నగర్‌లో గల ఓ ఇంట్లో చోరీకి పాల్పడిన నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు టూటౌన్ సీఐ కరుణాకర్ రావు తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మంగళవారం జై జవాన్‌నగర్‌కు చెందిన లక్ష్మి ఇంట్లో క్రాంతినగర్‌కు చెందిన షేక్‌అయాన్ 3 గ్రాముల బంగారం, సిల్వర్ చైన్‌ను దొంగిలించాడు. గురువారం పోలీసులు వాహన తనిఖీలు చేస్తున్న సమయంలో అనుమానం వచ్చి విచారించగా చోరీకి పాల్పడినట్లు ఒప్పుకున్నాడు. అదేవిధంగా పరీక్షల్లో అతడికి గంజాయి పాజిటివ్‌గా రావడంతో గంజాయి సేవించిన కేసు సైతం నమోదు చేశారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి



పంబాల లక్ష్మి మృతదేహం

సారంగపూర్: మండలంలోని ధని గ్రామానికి చెందిన పంబాల లక్ష్మి (46) అనే మహిళ నిర్మల్ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందింది. పోలీసులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం పంబాల లక్ష్మి, భర్త గంగాధర్‌తో కలిసి బుధవారం ద్విచక్రవాహనంపై నిర్మల్ వైపు వెళ్తుండగా ధని గ్రామ సమీపంలోని హనుమాన్ ఆలయం మూలమలుపు వద్ద ప్రమాదవశాత్తు బైక్‌పై నుంచి జారిపడి తీవ్ర గాయాలపాలైంది. వెంటనే 108లో నిర్మల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందింది. ఈమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.

ప్రమాదకారకులపై కేసు నమోదు

మందమర్రిరూరల్: నిబంధనలకు విరుద్ధంగా ద్విచక్రవాహనం నడిపి ప్రమాదానికి కారణమైన మైనర్ బాలుడితో పాటు ద్విచక్రవాహనం యజమానిపై కేసులు నమోదు చేసినట్లు ఎస్సై రాజశేఖర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. పుప్పాల రవి అతని భార్య రజిత బుధవారం ద్విచక్ర వాహనంపై యాపల్ నుంచి ఫస్ట్‌జోన్‌లోని వారి ఇంటికి వెళ్తుండగా, పాత బస్టాండ్ సమీపంలో వెనుక నుంచి వచ్చి ద్విచక్రవాహనం ఢీకొట్టింది. దీంతో రజిత కింద పడగా తలకు గాయమైంది. పుప్పాల రవి, రజితల కుమారుడు వినోద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ప్రమాదానికి కారణమైన మైనర్ బాలుడితో పాటు వాహనం యజమాని, మైనర్ బాలుడి తాత సారయ్యపై కూడా కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

అరుదైన గద్దలు..!

సర్పెంట్ ఈగల్



షార్ట్‌టుఎడ్ స్నేక్ ఈగల్



గ్రేహెడెడ్ ఫిష్ ఈగల్



కవ్వాల్ టైగర్‌జోన్ వన్యప్రాణులు, పక్షి జాతులకు పుట్టినిల్లు. గత నాలుగు సంవత్సరాలుగా జన్నారం అటవి డివిజన్‌లో వివిధ రకాల పక్షిజాతులు ఆవాసం ఏర్పరుచుకుంటున్నాయి. బైసన్‌కుంట, మైసమ్మ కుంట, ఘనిషెట్టి కుంట, నీలుగాయి కుంటల ప్రాంతాల్లో అరుదైన గద్ద జాతులను అటవీశాఖ అధికారులు గుర్తించారు. సర్పెంట్ ఈగల్, షార్ట్‌టుఎడ్ స్నేక్ ఈగల్, గ్రేహెడెడ్ ఫిష్ ఈగల్ తరచుగా ఇక్కడ కన్పిస్తున్నట్లు అటవీ అధికారులు తెలిపారు. అంతరించిపోతున్న గద్ద జాతులు కనిపించడంతో పక్షి ప్రేమికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. -జన్నారం

వరిపంటపై అడవిపందుల దాడి



ధ్వంసమైన వరిపంట

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం పెద్దంపేట గ్రామ పంచాయతీ పరిధి గొల్లపల్లి గ్రామానికి చెందిన తనుగుల సత్తయ్య అనే రైతు వరిపొలాన్ని బుధవారం అర్ధరాత్రి అడవి పందులు ధ్వంసం చేశాయి. పంట చేతికొచ్చే దశలో అడవి పందులు పంటను నాశనం చేయడంతో తీవ్రంగా నష్టం వాటిల్లింది. అడవి పందుల దాడి నుంచి పంటలను కాపాడుకోవడానికి పలువురు రైతులు రాత్రి సమయాల్లో కాపు కాస్తున్నారు. అయినా అడవి పందులు గుంపులుగా వచ్చి పంటను నాశనం చేస్తున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

విద్యార్థులకు ఫౌండేషన్

- సంక్షేమ గురుకులాల్లో ఫౌండేషన్ కోర్సులు
- ఎనిమిదో తరగతి నుంచి శిక్షణకు నిర్ణయం
- మెరిట్ విద్యార్థులకు ప్రాధాన్యత
- వచ్చే విద్యాసంవత్సరం నుంచి ప్రారంభం



బెల్లంపల్లి బాలుర సీఓఈ కళాశాల ముఖద్వారం

బెల్లంపల్లి: తెలంగాణ ప్రభుత్వ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో చదువుకుంటున్న విద్యార్థులకు మహర్దశ రానుంది. ప్రైవేట్ విద్యాసంస్థలకు దీటుగా గురుకుల విద్యార్థులకు ఎనిమిదో తరగతి నుంచే ఫౌండేషన్ కోర్సుల్లో శిక్షణ ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈమేరకు తెలంగాణ ప్రభుత్వ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సొసైటీ (టీజీఎస్‌డబ్ల్యూఆర్‌ఈఐఎస్) కార్యదర్శి అలుగు వర్షిణి ఫౌండేషన్ కోర్సులను ప్రారంభించనున్నట్లు ప్రకటించడంతో విద్యార్థులు, తల్లిదండ్రుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా ఎంపిక చేసిన 10 గురుకుల కళాశాలల్లో ఫౌండేషన్ కోర్సులను ప్రారంభించనున్నారు. ఐఐటీ జేఈఈ, నీట్, యూపీఎస్సీ, సీయూఇటీ, సీఎల్‌ఏటీ వంటి తదితర అత్యంత ప్రాధాన్యత కలిగిన కోర్సులకు శిక్షణ ఇవ్వనున్నారు. 2025 -26 విద్యాసంవత్సరం నుంచి ఫౌండేషన్ కోర్సుల్లో శిక్షణ ప్రారంభించనున్నారు.

ప్రవేశపరీక్ష ద్వారా ఎంపిక

ఫౌండేషన్ కోర్సుల్లో శిక్షణ ఇప్పించడానికి ఆసక్తి కలిగిన ఎనిమిదో తరగతి విద్యార్థులకు ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నారు. ప్రస్తుతం గురుకులాల్లో చదువుతున్న విద్యార్థులతో పాటు వచ్చే విద్యా సంవత్సరంలో 8వ తరగతిలో ప్రవేశం పొందనున్న విద్యార్థులకు సైతం పరీక్ష రాసే అవకాశం కల్పించనున్నారు. ప్రవేశపరీక్షలో మెరిట్ మార్కులు పొందిన విద్యార్థులను ఎంపిక చేసి ఫౌండేషన్ కోర్సుల్లో ప్రత్యేక శిక్షణ ఇస్తారు. తద్వారా ప్రతిభావంతులైన నిరుపేద విద్యార్థులకు ప్రయోజనం కలిగే అవకాశాలు ఉన్నాయి.

కళాశాలల ఎంపికపై ఆసక్తి

ఫౌండేషన్ కోర్సుల్లో శిక్షణ ఇప్పించడానికి ఏయే కళాశాలలను ఎంపిక చేస్తారనేది ఆసక్తికరంగా మారింది. విద్యాబోధనలో మెరుగైన ఫలితాలు సాధిస్తున్న గురుకుల విద్యాలయాలను ఎంపిక చేసే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ (సీవోఈ) కళాశాలలు మెరుగైన ఫలితాలు సాధిస్తూ ప్రత్యేకత చాటుకుంటున్నాయి. ప్రస్తుతం హైదరాబాద్‌లోని గౌలిదొడ్డిలో ఉన్న ప్రధాన క్యాంపస్ తోపాటు కరీంనగర్ (అల్గనూరు)లో ఉన్న సీవోఈ కళాశాలల్లో ఫౌండేషన్ కోర్సుల్లో శిక్షణ ఇస్తున్నారు. వీటితో పాటు కొత్తగా మరో 8 కళాశాలలను ఎంపిక చేయనున్నారు. అయితే రెండేళ్ల క్రితం రాష్ట్ర వ్యాప్తంగా 10 ఉత్తమ కళాశాలలను గుర్తించగా అందులో బెల్లంపల్లి బాలుర సీవోఈ కళాశాలకు ప్రాధాన్యత దక్కింది. గతంలో గుర్తించిన కళాశాలలను ఎంపిక చేస్తారా.. కొత్త కళాశాలలకు ప్రాధాన్యత ఇస్తారా.. అందుకు ఎలాంటి విధివిధానాలను అనుసరిస్తారనేది తేలాల్సి ఉంది.

కళాశాలల ఎంపిక జరగలేదు



సంక్షేమ గురుకులాల్లో 8వ తరగతి నుంచి పోటీ పరీక్షల్లో నెగ్గడానికి వీలుగా ఫౌండేషన్ కోర్సుల్లో శిక్షణ ఇప్పించాలని సొసైటీ నిర్ణయించింది. ఇందుకోసం రాష్ట్ర వ్యాప్తంగా 10 కళాశాలలను ఎంపిక చేయనున్నట్లు సమాచారం. ఏఏ కళాశాలలను ఏ ప్రాతిపదికన ఎంపిక చేస్తారనేది ఇంకా తెలియదు. త్వరలోనే ఖరారు చేసే అవకాశాలు ఉన్నాయి.

– అరుణకుమారి, జోనల్ అధికారి, సంక్షేమ గురుకుల విద్యాలయాల సొసైటీ

ఆగని ఇసుక దందా

- ఇటీవల ఐదు ట్రాక్టర్లు పట్టివేత
- కొనసాగుతున్న అక్రమ రవాణా
- తాజాగా మరో ఐదు ట్రాక్టర్లపై కేసు



ట్రాక్టర్లలో ఇసుక నింపుతున్న అక్రమార్కులు

దండేపల్లి: అధికారులు కఠిన చర్యలు తీసుకుంటున్నా మండలంలో ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట పడడంలేదు. అక్రమార్కులు అధికారులకు, పోలీసులకు ఏమాత్రం భయపడకుండా తమ దందాను యథేచ్ఛగా కొనసాగిస్తున్నారు. దండేపల్లి మండలం కాసిపేట గోదావరి తీరం నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తుండగా, ఇటీవల ఐదు ట్రాక్టర్లను పోలీసులు పట్టుకుని కేసులు నమోదు చేశారు. అయినా ఇవేమి పట్టించుకోకుండా గురువారం మళ్లీ ఇసుకాసురులు 15 ట్రాక్టర్లలో ఇసుకను తరలించేందుకు సిద్ధమయ్యారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ సంధ్యారాణి, ఆర్ఐ భూమన్న, సిబ్బందితో కలిసి గోదావరి తీరానికి చేరుకున్నారు. రెవెన్యూ, పోలీసు సిబ్బంది అక్కడికి చేరుకునేలోగా కొన్ని ఇసుక ట్రాక్టర్లను ధర్మపురి వైపు మళ్లించారు. దీంతో కేవలం ఐదు ట్రాక్టర్లు మాత్రమే పట్టుపడ్డాయి. కేసు నమోదు చేశామని, అక్రమంగా ఇసుక తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ తెలిపారు.

కారులో నిద్రిస్తున్న వారిపై దాడి

- ల్యాప్‌టాప్, బ్యాగు అపహరణ
- టేక్రియాల్‌లో రెచ్చిపోయిన దుండగులు



వీర రాఘవయ్య

కామారెడ్డిక్రైం: రోడ్డు పక్కన కారు నిలిపి విశ్రాంతి తీసుకుంటున్న వారిపై దుండగులు దాడి చేసి దోపిడీకి పాల్పడిన ఘటన కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని టేక్రియాల్‌లో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. ఆదిలాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన వీరరాఘవయ్య కుమారుడు నాగమణిదీప్ హైదరాబాద్‌లో పదో తరగతి చదువుతున్నాడు. పరీక్షలు పూర్తి కావడంతో కుమారుడిని స్వగ్రామానికి కారులో తీసుకొస్తున్నాడు. వీరరాఘవయ్య వెంట స్నేహితుడు కూడా ఉన్నాడు. గురువారం తెల్లవారుజామున 3.30 గంటల ప్రాంతంలో టేక్రియాల్ వద్ద పెట్రోల్ బంక్ పక్కనే ఉన్న ఓ హోటల్ ఎదుట రోడ్డు పక్కన కారు నిలిపి అందులో నిద్రించారు. నలుగురు దుండగులు కారు అద్దాలు పగలగొట్టి వారిపై దాడి చేసి కారులోని బ్యాగు, ల్యాప్‌టాప్ ఎత్తుకెళ్లారు. దాడిలో వీర రాఘవయ్యకు గాయాలయ్యాయి. దాడి జరిగిన వెంటనే రాఘవయ్య భయంతో కారును దాదాపు ఆరు కిలోమీటర్ల దూరంలోని సదాశివ నగర్ వరకు తీసుకెళ్లాడు. అక్కడ కారును నిలిపి డయల్ 100కు సమాచారం ఇచ్చాడు. ఎస్పీ రాజేశ్ చంద్ర, దేవునిపల్లి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అంతర్రాష్ట్ర చెక్‌పోస్టుపై ఏసీబీ దాడులు

- రూ.45,100 నగదు, రెండు సెల్‌ఫోన్లు సీజ్

వాంకిడి(ఆసిఫాబాద్): మహారాష్ట్ర సరిహద్దులోని కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి మండల కేంద్రంలో రోడ్డు రవాణా శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అంతర్రాష్ట్ర చెక్‌పోస్టులో బుధవారం అర్ధరాత్రి ఏసీబీ అధికారులు దాడులు నిర్వహించారు. కరీంనగర్ ఏసీబీ డీఎస్పీ రమణామూర్తి, ఆదిలాబాద్ ఏసీబీ డిఎస్పీ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో మరో నలుగురు సీఐలతో కలిసి రాత్రి 11:45 గంటల నుంచి తెల్లవారుజామున 3 గంటల వరకు సోదాలు చేపట్టారు. దాడుల సమయంలో అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ మాధవి ఒక్కరే విధుల్లో ఉండగా, ప్రైవేటు వ్యక్తులు డ్రైవర్ల నుంచి అక్రమంగా డబ్బులు వసూళ్లు చేస్తుండగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. లెక్క చూపని రూ.45,100 నగదును సీజ్ చేసినట్లు ఏసీబీ అధికారులు తెలిపారు. ప్రైవేటు వ్యక్తులకు సంబంధించిన రెండు మొబైల్ ఫోన్లు సీజ్ చేశామని, తదుపరి చర్యల కోసం విచారణ చేపట్టినట్లు డీఎస్పీ విజయ్‌కుమార్ తెలిపారు. ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారులు అవినీతికి పాల్పడితే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. తక్షణమే చర్యలు తీసుకోవడంతోపాటు సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని స్పష్టం చేశారు. దాడుల్లో సీఐలు కిరణ్, స్వామి, కృష్ణకుమార్, పున్నంచంద్ పాల్గొన్నారు.

ఒకే వాహనం.. రెండు ఫీజులు

- దేవుడి దర్శనానికి వాహనదారుల తిప్పలు
- పంచాయతీరాజ్ శాఖ పార్కింగ్ రుసుము..
- అటవీశాఖ ఎంట్రీ ఫీజు వసూలు



రుసుము వసూలు చేస్తున్న రెండు శాఖల సిబ్బంది

దండేపల్లి: మండల కేంద్రానికి పది కిలోమీటర్ల దూరంలో దట్టమైన అడవిలో కొలువైన పెద్దయ్య దేవుడిని చేరుకోవాలంటే వాహనదారులకు తిప్పలు తప్పడం లేదు. గురువారం పెద్దయ్య దేవుడి దర్శనానికి వెళ్లిన వాహనాలకు రెండు శాఖల వారు ఫీజులు వసూలు చేయడంతో భక్తులు ఖంగుతిన్నారు. పంచాయతీ శాఖ ఆధ్వర్యంలో పార్కింగ్ ఫీజు వసూలు చేస్తుండగా అటవీ శాఖ అధికారులు ఫారెస్టు ఎంట్రీ ఫీజు వసూలు చేశారు. రెండు శాఖలకు ఫీజు చెల్లించడంపై కొంతసేపు వివాదం నెలకొంది. విషయం తెలుసుకున్న ఎంపీడీవో ప్రసాద్ ఫారెస్టు చెక్‌పోస్ట్ వద్దకు చేరుకున్నారు. అటవీశాఖ అధికారులతో మాట్లాడారు. పంచాయతీరాజ్ శాఖ నిబంధనల ప్రకారం పార్కింగ్ రుసుం వసూలు కోసం టెండర్లు నిర్వహించారని, వారు ఫీజు వసూలు చేస్తారని అటవీశాఖ సిబ్బందికి నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. కానీ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎంట్రీ ఫీజు వసూలు చేస్తున్నామని వారు బదులిచ్చారు. విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకుందామని అప్పటివరకు ఎవరూ కూడా ఫీజులు వసూలు చేయొద్దని ఎంపీడీవో చెప్పినా అటవీ అధికారులు వినకుండా ఎంట్రీఫీజు వసూలు చేశారు. దీంతో భక్తులకు ఇబ్బంది కలగకూడదనే ఉద్దేశంతో పంచాయతీ అధికారులు పార్కింగ్ ఫీజు వసూలు చేయలేదు. విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తానని ఎంపీడీవో ప్రసాద్ తెలుపగా, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే ఎంట్రీఫీజు వసూలు చేస్తున్నామని డీఆర్వో పోచమల్లు పేర్కొన్నారు.

కేంద్ర మంత్రులను కలిసిన బీజేపీ నేతలు



కేంద్రమంత్రి గడ్కరీకి వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

నిర్మల్‌చైన్‌గేట్/భైంసాటౌన్/ఆదిలాబాద్: ఢిల్లీ పర్యటనలో భాగంగా ఢిల్లీ లోని పార్లమెంట్ హౌస్‌లో కేంద్ర రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ, కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడులను బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి అధ్యక్షతన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బీజేపీ నేతలు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఉమ్మడి జిల్లాలోని జాతీయ రహదారులు, ఆదిలాబాద్‌లో విమానయానం ఏర్పాటుపై చర్చించారు. బాసర నుంచి మహారాష్ట్రలోని మహోర్ వరకు హైవే అభివృద్ధి చేయాలని ముధోల్ ఎమ్మెల్యే పి.రామారావు పటేల్ నితిన్ గడ్కరీని కోరారు. కేంద్రమంత్రులను కలిసిన వారిలో ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేశ్, ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్, సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్ బాబు ఉన్నారు.

5న నాగోబా దర్బార్‌హాల్‌లో చర్చా వేదిక

ఇంద్రవెల్లి: మండలంలోని కేస్లాపూర్ నాగోబా ఆలయం సమీపంలో గుర్తు తెలియని దుండగులు హీరాసుక స్మారక జెండా తొలగించిన విషయంపై ఈనెల 5న నాగోబా దర్బార్ హాల్‌లో చర్చా వేదిక నిర్వహించనున్నట్లు నాగోబా ఆలయ పీఠాధిపతి మెస్రం వెంకట్‌రావ్ అన్నారు. గురువారం నాగోబా ఆలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఉమ్మడి జిల్లాలోని ఆదివాసీ మేధావులు, ఆయా గ్రామాల పెద్దలు, నాయకులు చర్చకు హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో మెస్రం వంశీయులు మెస్రం కోసేరావ్, మెస్రం బాదిరావ్ పటేల్, మెస్రం దుర్గు, మెస్రం ఆనంద్‌రావ్ తదితరులు ఉన్నారు.

ఆర్జీయూకేటీలో న్యాక్ సన్నాహక సమావేశం



మాట్లాడుతున్న ఇన్‌చార్జి వీసీ గోవర్ధన్

బాసర: ఆర్జీయూకేటీలో నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రెడిటేషన్ కౌన్సిల్ (ఎన్‌ఏఏసీ) మూల్యాంకనానికి సంబంధించిన సన్నాహక సమావేశాన్ని ఇన్‌చార్జి వీసీ ఎ.గోవర్ధన్ అధ్యక్షతన గురువారం నిర్వహించారు. సమావేశానికి ఓఎస్‌డీ, ఏవో, అసోసియేట్ డీన్లు, అధ్యాపకులు హాజరయ్యారు. ఇన్‌చార్జి వీసీ మాట్లాడుతూ న్యాక్ అక్రిడిటేషన్ ప్రక్రియ నిర్ధారించడానికి అధ్యాపకులు పూర్తివివరాలతో సిద్ధంగా ఉండాలన్నారు. యూనివర్శిటీ అకడమిక్, పరిపాలన, మౌలిక సదుపాయాల ప్రమాణాలు మెరుగుపర్చేందుకు అధ్యాపకులకు అవసరమైన సలహాలు, సూచనలు అందజేశారు. ఆర్జీయూకేటీ విద్యార్థులకు అత్యుత్తమ విద్యను అందించేందుకు, ప్రణాళికబద్ధంగా ఈ ఎన్‌ఏఏసీ మూల్యాంకన ప్రక్రియ విజయవంతంగా పూర్తి చేసేందుకు అన్ని చర్యలు తీసుకుంటుందని వివరించారు. వచ్చే విద్యాసంవత్సరం నుంచి పలు నూతన కోర్సులను ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఓఎస్డీ ప్రొఫెసర్ మురళీధర్శన్, ఏవో రణధీర్, అసోసియేటెడ్ డాక్టర్ విటల్, డాక్టర్ మహేశ్, డాక్టర్ చంద్రశేఖర్, హెచ్‌వోడీలు, అధ్యాపకులు పాల్గొన్నారు.

స్నేహితుడిపై హత్యాయత్నం.. కేసు నమోదు



వివరాలు వెల్లడిస్తున్న ఏఎస్పీ రాజేశ్ మీనా

నిర్మల్‌టౌన్: తన స్నేహితుడినే హత్య చేసేందుకు ఓ వ్యక్తి ఇతరులతో కలిసి యత్నించిన ఘటన జిల్లా కేంద్రంలో చోటుచేసుకుంది. జిల్లా కేంద్రంలోని డీఎస్పీ కార్యాలయంలో నిర్మల్ ఏఎస్పీ రాజేశ్ మీనా గురువారం వివరాలు వెల్లడించారు. స్థానిక బాలాజీవాడకు చెందిన రాజులదేవి ప్రమోద్ ఒక అమ్మాయిని ప్రేమించాడు. అదే అమ్మాయిని దినేశ్ అనే మరో వ్యక్తి కూడా ప్రేమించాడు. ఈ విషయంపై వారిద్దరి మధ్య తరుచూ గొడవలు జరిగాయి. ఈనెల 1న మరోసారి వీరిద్దరి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. ఒకరిపై ఒకరు దాడికి యత్నించడంతో అక్కడే ఉన్న కోట్ల రాజేశ్ వారిని అడ్డుకుని ఇద్దరిని అక్కడి నుంచి పంపించాడు. దీంతో ప్రమోద్ తన మిత్రుడైన రాజేశ్, దినేశ్‌కు మద్దతు ఇస్తున్నాడని భావించి రాజేశ్‌పై కోపం పెంచుకున్నాడు. అతడిని హత్య చేయాలని నిర్ణయించుకున్నాడు. అదేరోజు అర్ధరాత్రి రాజేశ్‌ను రామ్‌రావు బాగ్‌లోని మైసమ్మ కుంట గుట్ట ప్రాంతానికి పిలిచి గొడవపడ్డాడు. ప్రమోద్ మరో మిత్రుడైన కార్తిక్ సింగ్‌తో కలిసి రాజేశ్‌పై దాడి చేశాడు. పగిలిన బీరు సీసాతో పొడిచి హత్యాయత్నం చేశారు. ఇందుకు బబ్లు అలియాస్ రాజ్‌కుమార్, సచిన్ సింగ్‌లు సహకరించారు. రాజేశ్ తల్లి పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసిన పోలీసులు చాకచక్యంగా వ్యవహరించి 24 గంటల్లో నలుగురు నిందితులను అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు.

జేసీ వాహనం డ్రైవర్ మృతి



రవీందర్ రెడ్డి(ఫైల్)

బోథ్: ఆదిలాబాద్ జిల్లా జేసీ శ్యామలాదేవి వాహనం డ్రైవర్ నూతుల రవీందర్ రెడ్డి (కాల్వ రవి) గుండెపోటుతో మృతిచెందారు. బోథ్ మండలంలోని ధన్నూర్ బి గ్రామానికి చెందిన ఆయన గత 10 సంవత్సరాలుగా జేసీ వాహన డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఆదిలాబాద్‌లో నివాసముంటున్న ఆయనకు బుధవారం రాత్రి 11 గంటల సమయంలో గుండెపోటు రావడంతో, కుటుంబ సభ్యులు రిమ్స్‌కు తరలించారు. కాగా ఈసీజీ తీసే క్రమంలో ఆయన మృతిచెందారు. గురువారం ధన్నూర్ బి గ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు. ఆయన మృతిపట్ల జేసీ శ్యామలాదేవి సంతాపం తెలిపారు. మృతుడికి భార్య, కుమారుడు, కూతురు ఉన్నారు.

మానసిక అనారోగ్యంతో వివాహిత ఆత్మహత్య

గుడిహత్నూర్: మానసిక అనారోగ్యంతో వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని గురుజ గ్రామంలో చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు, పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని గురుజ గ్రామానికి చెందిన పెందూర్ జైవంత్ రావ్ -దేవుబాయిల చిన్న కూతురు కరుణ(24)ను ఆదిలాబాద్ మండలం లోకారి గ్రామానికి చెందిన నైతం లక్ష్మణ్‌తో రెండేళ్ల క్రితం వివాహం జరిపించారు. ఈ క్రమంలో గత కొన్ని నెలలుగా మానసిక అనారోగ్యంతో బాధపడుతున్న కరుణ పదిరోజుల క్రితం తల్లిగారింటికి వచ్చింది. గురువారం ఉదయం కుటుంబ సభ్యులు చేనుకు వెళ్లగా ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఇంటి దూలానికి చున్నీతో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. కుటుంబ సభ్యులు ఇంటికి వచ్చి చూసి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్‌కు తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కె.మహేందర్ తెలిపారు.

ప్రాజెక్టులో దూకి ఒకరు..

భైంసాటౌన్: పట్టణంలోని సిద్ధార్థనగర్‌కు చెందిన దగ్గే సునీల్ (36) స్థానిక గడ్డెన్నవాగు ప్రాజెక్టు నీటిలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు, కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. కూలీ పనులు చేసే సునీల్ మద్యానికి బానిసయ్యాడు. ఆర్థిక పరిస్థితులు అంతంత మాత్రంగానే ఉండడంతో మనస్తాపానికి గురై బుధవారం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. గురువారం ఉదయం ప్రాజెక్టు వద్ద చెప్పులు, ఇతర వస్తువులు కనిపించడంతో స్థానికులు పోలీసులకు సమాచారమిచ్చారు. వారు అక్కడకు చేరుకుని సునీల్ మృతదేహాన్ని వెలికితీశారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియాస్పత్రికి తరలించారు. సునీల్ తండ్రి అనురథ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై గౌసుద్దీన్ తెలిపారు.

నకిలీ కంటి వైద్యులను నమ్మి మోసపోవద్దు

మంచిర్యాలటౌన్: ప్రజలు నకిలీ కంటి వైద్యుల వద్ద పరీక్షలు, శస్త్రచికిత్సలు చేసుకుని మోసపోవద్దని టీజీఎంసీ, ఐఎంఏ టాస్క్‌ఫోర్స్ బృందం సభ్యులు అన్నారు. జిల్లా కేంద్రంలో గురువారం క్లినిక్‌ల్లో తనిఖీలు నిర్వహించారు. నైనా ఆప్టికల్, ఓల్డ్ నైనా ఆప్టికల్, శ్రీవెంకటేశ్వర ఆప్టికల్‌లో తాము కంటి వైద్యులమని ప్రజలను మోసం చేస్తున్నారన్నారు.